www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 6 జూన్ 2025

సైఫాన్ నిర్మాణ పనుల పరిశీలన

'ప్రజాశక్తి' వార్తకు స్పందన



వివరాలను తెలుసుకుంటున్న ఆర్డిఓ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

లొల్ల, వాడపల్లి వద్ద ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్ లో రూ.2.30 కోట్లతో జరుగుతున్న సైఫాన్ నిర్మాణ పనులను గురువారం కొత్తపేట ఆర్డిఓ, పి.శ్రీకర్, ఇంజినీరింగ్ బృందం పరిశీలించారు. పనులు ఎలా చేస్తున్నారని పరిశీలించి గుత్తేదారుకు పలు సూచనలు ఇచ్చారు. ఎటువంటి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పనులు నిర్వహించాలని ఎఇ జయలక్ష్మి ఆదేశించారు. సోమవారం 'ప్రజాశక్తి'లో సైఫాన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం, అధికారుల పర్యవేక్షణ కరువు, ఇష్టానుసారంగా గుత్తేదారు పనులు అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్డిఓ, ఇంజినీరింగ్ అధికారులు సైఫాన్ పనులు పరిశీలించారు

రైతుకు దక్కేనా.. భరోసా

- జిల్లాలో ఇకెవైసి ... ఆతర్వాతే తుది జాబితా
- కుటుంబంలో ఒకరికే పథకం వర్తింపు
- కౌలు రైతులకు లేనట్లే
- కౌలు రైతుల ఆశలపై నీళ్లు



వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు (ఫైల్)

అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల గుర్తింపునకు ప్రభుత్వం విస్తత కసరత్తు చేస్తోంది. త్వరలోనే దీన్ని అమలులోకి తీసుకురానుండటంతో ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించి ఒకదశ పూర్తి చేసింది. గత ప్రభుత్వం కేంద్రంతో కలిసి రూ.13,500 ఇస్తే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు చేసింది. ఈ మొత్తం అనర్హులకు అందకుండా, అర్హులకు అన్యాయం జరగకుండా పలు జాగ్రత్తలు తీసుకొంటోంది. వివిధ దశల్లో వ్యవసాయ, రెవెన్యూ అధికారుల పరిశీలన జరుగుతోంది. ఈనెలలోనే పథకాన్ని అమలు చేసి రైతుల ఖాతాలలో నగదును జమ చేసేందుకు అంతా సిద్ధం చేస్తోంది.

ప్రజాశక్తి - రాజోలు

కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి అమలు చేస్తున్న పిఎం కిసాన్ పథకానికి రాష్ట్రప్రభుత్వం తన నిధులను కలిపి అన్నదాత సుఖీభవను అమలు చేయనుంది. పిఎం కిసాన్ పథకం కింద కేంద్రం ఏటా రూ.6వేల నగదును మూడు విడతలుగా రైతుల ఖాతాలకు జమ చేస్తోంది. దానికి మరో రూ.7,500 కలిపి గత వైసిపి ప్రభుత్వం ఏటా రూ.13,500 రైతులకు ఇచ్చింది. అయితే ఈ మొత్తాన్ని రూ.20 వేలకు పెంచుతామని ఎన్నికల ప్రచార సమయంలో టిడిపి ప్రకటించింది. ప్రస్తుతం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ఈనెలలో అమలుకు నిర్ణయించింది. భారీగా పథకం నగదును పెంచడంతో లబ్ధిదారుల గుర్తింపులో పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందుకు సంబంధించి తొలిదశ ప్రక్రియ పూర్తయింది. అందులో వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఉన్న రైతు ఖాతాలను నేరుగా రాష్ట్రప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా జాబితాలను ప్రాథమిక పరిశీలన కోసం జిల్లాలకు పంపించింది. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇప్పటివరకు 3,67,049 మంది రైతుల వివరాలకుగాను 3,66,868 మందివి మాత్రమే పరిశీలన పూర్తయ్యాయి. ఇంకా 40,374 మంది రైతుల సమస్యలను రెవెన్యూ అధి కారులు పరిష్కరించాల్సి ఉండగా, అందులో 2,011 మాత్రమే పరిష్కారమయ్యాయి. ఇలా సరిచేసిన రైతు లకు మా త్రమే అన్నదాత సుఖీభవ అందే అవకాశం ఉంది. లేదంటే అభ్యం తరాలు పెండింగ్‌లో ఉన్న అన్న దాతలకు ప్రయోజనం దక్కే అవకాశం ఉండదు.

ఆధార్, పేర్లలో తేడాలతో..

ప్రభుత్వం పంపిన జాబితాలను వ్యవసాయశాఖ, క్షేత్ర స్థాయిలోని రెవెన్యూ సిబ్బంది పరిశీలించగా అందులో 40 వేల పేర్లకు సంబంధించి ఆధార్ నంబరు, పేర్లు, ఇతరత్రా వాటిలో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. వాటి పరిశీలన కోసం వ్యవసాయశాఖ నుంచి తహసీల్దార్లకు అందజేశారు. వాటిలో అధికభాగం భూముల కొనుగోలు, అమ్మకాలు జరిగి మ్యుటేషన్లు జరగాల్సినవి ఉన్నట్లు సమాచారం. సజావుగా ఉన్న 3.67 లక్షల ఖాతాల జాబితాలను తిరిగి ప్రభుత్వానికి నివేదించారు. వాటిని ప్రభుత్వ స్థాయిలో కుటుంబ సర్వే ఆధారంగా పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. ఒక కుటుంబానికి ఒకరికే పథకం లబ్ధి అందజేస్తారు. జిల్లాలో ప్రభుత్వం నుంచి ఇచ్చిన 4.30 లక్షల ఖాతాలలో ఇంచుమించు సగానికిపైగా ఒకే కుటుంబంలో ఇద్దరి, ముగ్గురి పేర్లతో భూములు ఉన్నట్లు సమాచారం. దీంతో ఇప్పటికే సచివాలయాల సిబ్బంది ద్వారా ప్రభుత్వం నిర్వహించిన కుటుంబ సర్వేలో భూయజమానుల జాబితాల వివరాలను సరిపోల్చే చర్యలను ప్రభుత్వం చేపట్టింది.

వేలిముద్ర, ఐరిస్ ద్వారానే ఇకెవైసి

నెలకు రూ.10వేల కన్నా అధికంగా పెన్షన్లు పొందే వారు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపన్ను చెల్లించేవారికి పథకం వర్తించదు. ఆధార్ సీడింగ్ ఆధారంగా ఇలాంటి వారిని గుర్తించే ప్రక్రియను ప్రభుత్వస్థాయిలోనే చేస్తున్నట్లు సమాచారం. అది పూర్తయిన తర్వాత ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలను తిరిగి జిల్లాలకు పంపిస్తారు. మళ్లీ ఆ జాబితాలలో పేర్లు ఉన్న వారందరికీ ఇకెవైసి చేయాలి. అది కూడా గతంలో ఇ కాప్ నమోదు, ఇతరత్రా వాటికి చేసిన తరహా సెల్‌ఫోన్ నంబర్ ఓటీపీతో ఇకెవైసి చేసే అవకాశం లేదు. విధిగా సదరు లబ్ధిదారులుగా గుర్తించిన రైతుల వేలిముద్ర లేదా ఐరిస్ ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలి. దాని ద్వారా స్థానికంగా వ్యవసాయం చేయకుండా విదేశాలలో, ఇతర ప్రాంతాల్లో ఉండి ప్రభుత్వ లబ్ధి పొందే వారిని కట్టడి చేయనున్నారు.

కౌలు రైతు కార్డులు లేక దూరం

ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం వాస్తవ పట్టా భూముల యజమానులు, అటవీ భూముల హక్కు పత్రాలు ఉన్న వారికి మాత్రమే ఈ పథకం అందనుంది. కౌలు రైతులకు, దేవదాయ భూములు సాగు చేస్తున్న వారికి అందే అవకాశాలు లేవు. కౌలు రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నా అధికారికంగా కౌలుగుర్తింపు కార్డులు ఉన్నవారే అర్హులు, అలాంటి కార్డులు ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభ తర్వాత జారీ అవుతాయి. దానివల్ల తొలివిడతగా పథకం అందించే లబ్ధిదారులలో వారు ఉండే అవకాశం లేదు.వీటిని రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మరోసారి తనిఖీ చేయనుంది.ఆ తర్వాత లబ్ధిదారుల జాబితాలను మళ్లీ జిల్లాలకు పంపనుంది. ఈ జాబితాలను రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రదర్శించి త్వరలో అభ్యంతరాలు స్వీకరిస్తారు.ఆతర్వాత తుది జాబితా రూపొందించి పథకం డబ్బులను రైతుల ఖాతాలకు జమ చేస్తారు.అనంతరం వారికి అన్నదాత సుఖీభవ అందే అవకాశం ఉంది. ఇతరుల విషయంలో ప్రభుత్వం తదుపరి చర్యలకు అనుగుణంగా ఉంటాయి.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

- ప్రభుత్వ స్కూల్లో పనిచేసే నైట్ వాచ్‌మెన్ల ధర్నా
- పాల్గొన్న సిఐటియు నాయకులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం

పెండింగ్ లో ఉన్న నాలుగు నెలల జీతాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే నైట్ వాచ్మెన్ లో గురువారం ధర్నా నిర్వహించారు.ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.దుర్గాప్రసాద్, నూకల బలరామ్ మాట్లాడుతూ స్కూల్లో పనిచేసే నైట్ వాచ్‌మెన్‌కు నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. వీరికి ఇచ్చే జీతం రూ.6వేలు మాత్రమేనని వీటిని కూడా సకాలంలో ఇవ్వకపోతే వీరి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. వీరికి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, 8 గంటల పని అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అటెండర్ పోస్టులకు నైట్ వాచ్‌మెన్లకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. వీరితో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని అన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు అంతేకాకుండా పగలు సమయంలో స్కూల్లో అనేక పనులు చేయించుకుంటున్నారని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. నైట్ వాచ్‌మెన్‌గా ఉద్యోగంలోకి తీసుకున్నప్పుడు అతను నైట్ వాచ్మెన్ గానే పనిచేసేలా గాని ఆ ఉద్యోగంతో అన్ని పనులు చేయించుకోవడం దారుణం అన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా నూకల బలరామ్ ,అధ్యక్షులుగా బొక్కా రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నల్లి కృష్ణ, ప్రధానకార్యదర్శిగా చింతపల్లి సత్యనారాయణ, కోశాధికారిగా సిరంగుల శేఖర్, వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా నాగరాజు, కమిటీ మెంబర్స్ గా ప్రేమ్ కుమార్, శ్రీను, వీధి శ్రీనివాసు, దంగేటి గోపాల కృష్ణ, భాను, ఏడిద మూర్తి, పాలపర్తి సత్య ప్రసాద్, గుగ్గిల సత్యం, అయినవిల్లి వెంకటరమణ 22 మండలాల ఉద్యోగులు పాల్గొన్నారు. మహిళా సంఘం నాయకులు భవాని, జిల్లా కోశాధికారి అమూల్య, అంగన్‌వాడీ నాయకులు దైవకృప,ఉమ పాల్గొన్నారు. జూలై 9 జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో సిఐటియు నాయకులు

సబ్సిడీపై యంత్ర పరికరాల పంపిణీ

ప్రజాశక్తి - మండపేట

రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో 50 శాతం సబ్సిడీ పై పరికరాలను కూటమి ప్రభుత్వం అందిస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట మండలానికి సంబంధించిన రెండవ విడత గా మంజూరైన 12 పవర్ టిల్లర్లు, 2 రోటో వేటర్లు ను మండపేట ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ఎంఎల్ఎ వేగుళ్ల రైతులకు యాంత్రీకరణ పరికరాలను పంపిణీ చేశారు. యూనిట్ విలువ రూ.30.75 లక్షలకు గాను ప్రభుత్వ సబ్సిడీపై రూ.12.92 లక్షలకు అందిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, మండపేట మండల అధ్యక్షులు కర్రి తాతరావు, మాజీ అధ్యక్షులు యరగతపు బాబ్జి, మండపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ చింతపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవం



అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జెసి టి.నిషాంతి తదితరులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో వనమహోత్సవాన్ని గురువారం ఘంనగా నిర్వహించారు. ఈస ందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్ని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అమలాపురం: స్థానిక గడియార స్తంభం సెంటర్ నందు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమంలో జెసి టి.నిషాంతి పాల్గొన్నారు. మొక్కలు నాటారు. స్థానిక శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు ప్రసంగిస్తూ ప్రకతిని మనం కాపాడితే ప్రకతి మనల్ని కాపాడు తుందన్నారు. చివరిగా జ్యూట్ బ్యాగులను పంపిణీ చేసి పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ చైర్పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, ఆర్‌డిఒ కె.మాధవి, ఎంపిడిఒ బాబ్జి రాజు, తహశీల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు. **అంబాజీపేట :** అంబాజీపేట,ముక్కామల పిహెచ్‌సిల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి–ఆరోగ్య వంతులుగా జీవించండి.. నినాదాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబాజీపేట పిహెచ్‌సి వైద్యాధికారి కె.ఎన్.శ్రీనివాస్, ముక్కామల వైద్యాధికారిణి డాక్టర్ టి.దివ్యశ్రీ మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా పిహెచ్‌సి ల సిహెచ్‌ఓ లు బి.అప్పారావు,ఎమ్.రవికుమార్ వైద్య సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** ద్రాక్షారామంలోని గురుకుల పాఠశాలలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మొక్కలు నాటారు.. అధికారులు మొక్కలు ఆవరణలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ డి.అఖిల, గురుకులం పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస రావు, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాదరావు, ఎంపిడిఒ కె.పద్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని వెంకటాయపాలెం సర్పంచ్ ఎల్లమెల్లి సతీష్ కుమారి అన్నారు. గురువారం పర్యావరణదినోత్సవం కార్యక్రమంలో భాగంగా వెంకటాయపాలెం గ్రామం లో దాసరి పాడు, చిన్నంపేట గ్రామంలో ఉన్న వివిధ ప్రదేశములలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కాపాడుకో వాలని లేకుంటే వాతావరణ అసమతుల్యత, భారీ వర్షాలు అధిక ఉష్ణోగ్రతలు వంటి ప్రకృతి వైపరీత్యాలు చోటుచేసుకుంటాయని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ , వార్డు మెంబర్ విశ్వనాథం, కూటమి సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ మణికంఠ, సచివాలయం సిబ్బంది పంచాయతీ సిబ్బంది, ఆశ వర్కర్స్ , గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రామచంద్రపురం కోర్టు ఆవరణలో, అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.నాగేశ్వరావు నాయిక్, మొక్కలు నాటారు. ార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉండవిల్లి గోపాలరావు, సెక్రటరీ బొడ్డు వరాహ నరసింహ మూర్తి, ట్రెజరర్ చింతపల్లిశ్రీనివాస రావు, పిల్లా పథ్వీ, బండి శ్రీనివాస్, పాలచర్ల భరత్ బాబు తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** నగర పంచాయతీ పరిధిలోని బాలయోగి ఆశ్రమం, మున్సిపల్ కార్యాలయం, లాంప్ కళాశాల, ఎయిమ్స్ కళాశాల తదితర ప్రాంతాల్లో వన మహోత్సవ సందర్భంగా నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ ఆద్వర్యంలో జరిగిన మనం – వనం కార్యక్రమంలో



వెంకటాయపాలెంలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ సతీష్ కుమారి



ద్రాక్షారామంలోని గురుకుల పాఠశాల్లో ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి సుభాష్, ఆర్‌డిఒ

ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారుకార్యక్రమం లో ఇన్ ఛార్జ్ కమిషనర్ పి.వి.సుధాకర్, మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద,చెల్లి అశోక్ ,గుత్తుల సాయి, దాట్ల పథ్వీ రాజ్, ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకష్ణ ,తాడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. **ఐ.పోలవరం:** మండలంలో పాతఇంజరం, కొమరగిరి, మురమళ్ళ వివిధ గ్రామ పంచాయతీల కార్యాలయం వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. మురమళ్ళ గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద సర్పంచ్ కాలే రాజబాబు సమక్షంలో ఉపాధి హామీ కూలీలుతో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు స్వచ్ఛహరితాంధ్ర అభివద్ధికి తోడ్పడతానిని ప్రతిజ్ఞ చేయించారు. పాతఇంజరంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద మాట్లాడారు. కార్యక్రమంలో గుత్తుల సాయి,కురసాల శివబాబు, పేరాబత్తుల వెంకటరమణ,కొమరగిరి సర్పంచ్ వరసాల విజయ చాముండేశ్వరి,బుచ్చి కష్ణంరాజు, ఆర్.వర ప్రసాద్, ఐ.నాగార్జున, పి.రవి రాజు వివిధ గ్రామ పంచాయితీ శాఖ సిబ్బంది, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ లు ,ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు. **ఆలమూరు:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోనూ, పలు గ్రామాల కాలువ గట్లపై వివిధ రకాలైన పండ్ల జాతి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ, ఎంపిడిఒ ఎ.రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.ార్యక్రమంలో ఉపాధి ఎపిఒ ఎం.అరుణ కుమారి, వెలుగు ఎపిఎం ఎం.ధనరాజు, ఉపాధి ఇసి ప్రకాష్, సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు. **సఖినేటిపల్లి:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ కొబ్బరి మొక్క నాటారు. మండల అభివద్ధి కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు, కార్యక్రమంలో ఎంపిపి వీరా మల్లిబాబు, మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **మండపేట:** ద్వారపూడి పి.హెచ్.సి నందు రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, మండపేట మండల అధ్యక్షులు కర్రి తాతరావు, మాజీ మండల అధ్యక్షులు యరగతపు బాబ్జి, అడబాల బుల్లబ్బు, పల్ల బాబు, పల్ల వాసు, తానంకి చంద్రశేఖర్ తదితరులు,పాల్గొన్నారు. **రాజోలు:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాజోలు కోర్టు ప్రాంగణంలో మొక్కలు రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ప్రమీల రాణి నాటారు. ఈ కార్యక్రమంలో ఎజిపి జి.రజిత, కోర్టు సూపరింటెండెంట్ కాంతారావు, న్యాయవాదులు,కోర్టు సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం:** ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో మండల ఉపాధ్యక్షులు పెన్మెత్స బంగార్రాజు , జడ్‌పిటిసి సభ్యులు బోణం సాయిబాబా, మండల స్పెషల్ ఆఫీసర్ ఎంవి.రామారావు, ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట రామన్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.వి.ప్రసాదరావు, డిప్యూటి ఎంపిడిఒ యు.చంద్ర శేఖర్, వి రామ స్వరూప్, హెచ్ఎం ప్రసాద్, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** గొల్లవిల్లి గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, నాయకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసుబాబు, నాయకులు జొన్నాడ చిన్ని,నాగారపు అర్జునరావు, పంచాయతీ కార్యదర్శి ఎండి,షెహన్ షా తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆయా గ్రామ పంచాయతీలలో సర్పంచ్ లు నాయకులు మొక్కలు నాటారు. **కాట్రేనికోన:** స్థానిక జడ్ హైస్కూల్లో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కోలాటి సత్యవతి సత్యం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటాచలం, పంచాయతీ కార్యదర్శి జెవివి.సత్యనారాయణ, ఉపాధి ఎపిఒ బొంతు నాగరాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.




మొక్కలు నాటుతున్న ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు



ద్వారపూడిలో మొక్కలు నాటుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

కార్టూ'నిజం'



రైతుల సంక్షేమమే లక్ష్యం


- పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ
- నగరం ఎఎంసి పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



నగరం ఎఎంసి పాలకవర్గంతో పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

ప్రజాశక్తి - మామిడికుదురు

రైతుల సంక్షేమమే లక్ష్యంగా నూతనంగా నియమితులైన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం పనిచేయాలని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ సూచించారు. నగరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం నూతనంగా ఛైర్మన్‌గా నియమితులైన పెనుమాల లక్ష్మి, వైస్ ఛైర్మన్‌గా గుడాల వెంకటరమణ, డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో ఎంఎల్ఎ గిడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో మామిడికుదురు మండలం నుంచి అసెంబ్లీ ఎన్నికలలో అత్యధిక మెజార్టీ రావడంతో ఛైర్మన్ పదవి ఈ మండల వాసులకు కేటాయించడం జరిగిందన్నారు. కష్టపడే కార్యకర్తకు అధిష్టానం గుర్తింపు ఇస్తుందన్నారు. ఛైర్మన్ లక్ష్మి మాట్లాడుతూ కూటమి నాయకులు, పాలకవర్గం, అనుభవజ్ఞులైన రైతుల సూచనలు, సలహాలు తీసుకుని రైతుల సంక్షేమం కోసం సమైక్యంగా కృషి చేస్తామన్నారు. వైస్ ఛైర్మన్ గూడాల వెంకటరమణ మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర, సబ్సిడీపై ఎరువులు అందించేందుకు పాలకవర్గం కృషి చేస్తామన్నారు. పర్యావరణ దినోత్సవ సందర్భంగా మార్కెట్ యార్డ్ ఆవరణలో ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, ఎఎంసి ఛైర్మన్ లక్ష్మి, సర్పంచ్ జాలెం రమణ కుమారి మొక్కలు నాటారు. పర్యావరణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంఎల్ఎ కోరారు. ఈ సమావేశంలో జడ్‌పి మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, జనసేన నాయకులు వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, ఎంపిపి గనిశెట్టి నాగలక్ష్మి శ్రీనివాస్, మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, విళ్ళ సుబ్బారావు, రజ్వి, డొక్కా నాథ్ బాబు, మద్దాల పెద్దకాపు, కూటమి నాయకులు, ఎఎంసి కార్యదర్శి జి.ప్రదీప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నగరం ఎఎంసి ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మి, పాలకవర్గం

ఇంజినీరింగ్ కార్మికులకు సిఐటియు సంఘీభావం

ప్రజాశక్తి - అమలాపురం

తమ సమస్యలు పరిష్కరించాలంటూ అమలాపురం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు గత 30 రోజుల నుండి రిలే దీక్ష చేస్తున్న కారణంగా గురువారం సమ్మెకు మద్దతుగా సిఐటియు బందం గా వెళ్లి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం స్కిల్ ,సెమిస్కిల్ పద్ధతిలో వేతనాలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలని, డిమాండ్ చేశారు. 5 సంవత్సరాలు సర్వీస్ ఉన్నవారు అందర్నీ రెగ్యులర్ చేయాలని,కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటించారు. భవిష్యత్తులో సిఐటియు అన్నివేళలా సాహయం అందిస్తామని హామీ ఇచ్చారు. సమ్మెకు వెళ్లకుండానే రాష్ట్ర ప్రభుత్వం చర్చిలు జరిపి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సిఐటియు కన్వీనర్ బి. .అమూల్య, మహిళా సంఘం నాయకులు భవాని అంగన్‌వాడీ నాయకులు దైవకృప, ఉమ, వర్కర్స్ ఎ. వీరబాబు, ఎన్.శ్రీనివాస్, డి.షణ్ముఖరావు, ఎం.దుర్గ, అర్జున్‌రావు, చిక్కాల కుమార్, ఎన్.కష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్

నేరాలు ఘోరాలు

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మనస్థాపానికి గురై ఒక వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాలు ప్రకారం మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన రేలంగి సుబ్బారావు (55) కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల కాలంలో చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో కుమారుడు మందలించగా మనస్థాపానికి గురై బుధవారం పురుగుల మందు తాగాడు. వెంటనే అతనిని కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట శివారున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..సీతానగరం గ్రామానికి చెందిన కురుకూరి అబ్బులు అతని కుమారుడు రాము జగ్గంపేట నుంచి స్వగ్రామానికి వెళుతుండగా లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అబ్బులు కాలుకు బలమైన గాయం కాగా, రాముకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

గ్రావెల్ తరలిస్తున్న వారిపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి గ్రామంలో పోలవరం పుష్కర కాలువ గట్టు నుంచి నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్‌ను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో గురువారం తెల్లవారుజామున విఆర్ఒ దొండపాటి చంటిబాబుతో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. గ్రావెల్‌ను తరలిస్తున్న ట్రాక్టర్, లోడ్ చేస్తున్న జెసిబిని స్వాధీనం చేసుకుని, వాటి డ్రైవర్లు ఇంతిపల్లి జ్యోతిబాబు, లొండ శంకర్‌ను అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. తాటిపర్తికి చెందిన స్వామి ఆధ్వర్యంలో ఈ గ్రావెల్ రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

భారీ కొమ్మపడి చిన్నారి దుర్మరణం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలోని స్థానిక బస్టాండ్ వెనుక విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మ పడడంతో విద్యుత్ వైర్లు తెగిపడి అక్కడే ఆడుకుంటున్న చిన్నా పాతూరి అక్షర (9)కు తగలడంతో ఆమె ఘటనా స్థలంలోనే మృతి చెందింది. గాయపడిన మరొక చిన్నారిని దేవదాసి లిషితను హుటాహుటిన రాజమహేంద్రవరంలోని విజయసాయి హాస్పటల్లో జాయిన్ చేర్చారు. ఈ సంఘటనతో పాతపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.


ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్, ఎంఎల్ఎ సత్యనారాయణ

పద్మావతి టవర్స్ ప్రారంభం

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేటలో పద్మావతి ట్రేడర్స్ అధినేత మైపాల తాతాజీ నూతనంగా నిర్మించిన పద్మావతి టవర్‌ను గురువారం కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గృహాలు నిర్మాణాలకు స్థలాలు లభ్యం కాకపోవడంతో టవర్ల నిర్మాణంతో పెరుగుతున్న జనాభాకు కొంతమేర ఉప శమను లభిస్తుందన్నారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ భూములు మరిగయిపోకుండా టవర్ల నిర్మాణం ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి మాజీ చైర్మన్ నామన రాంబాబు, గంధం పల్లంరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, స్థానిక సర్పంచ్ నాగబత్తుల శాంతా కుమారి సుబ్బారావు, బొంతు పెదబాబు, జివి.రాఘవులు, నగరం ఎఎంసి చైర్మన్ పెనుమాల లక్ష్మి, అరిగెల సూరిబాబు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

శ్యామలరావుకు ఘన సత్కారం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ధ్యాన బోధన సామాజిక సేవకు గుర్తింపుగా గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారిచే డాక్టరేట్ అందుకున్న కొసనం కోట నాగశ్యామలరావు మాస్టారును గురువారం మంగళగిరిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు బండారు ఆనంద ప్రసాద్, తిరుపతి శ్రీశ్రీనివాస రామలింగేశ్వర, దేవాంగ నిత్యాన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి నక్కిన చిన్న వెంకటరాయుడు, ఏపీ హైకోర్టు న్యాయవాది కర్రా రవి తదితరులు శ్యామలరావు స్వగృహంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నాగశ్యామలరావు, విజయలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

మండుతున్న ఎండలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

వారం రోజుల నుంచి ఎండులు మండుతున్నాయి. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయి. దీంతో మెయిన్ రోడ్లన్నీ కర్ఫ్యూ వాతావరణం తలపిస్తున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు మెయిన్ రోడ్లన్నీ జనం లేక వేలవేల పోతున్నాయి. ఇదే సమయంలో శీతలపానీ యాలకు జనం ఎగపడుతున్నారు. అధిక ఉష్ణోగ్రత ల కు ఉపాధి కూలీలు ఎండలో పని చేయలేక అల్లాడుతున్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ దేవవరప్రసాద్

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేయాలని పనిచేయలని ఎంఎల్ఎ దేవ వర ప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. రాజోలు ఎంఎల్ఎ దేవ వర ప్రసాద్ పాల్గొనగా, సమావేశానికి ఎంపీపీ వీర మల్లిబాబు అధ్యక్షత వహించారు. ఎంపీడీవో సూర్యనారాయణ, తహశీల్దార్ వెంకటేశ్వరరావులు అధికారులను సమన్వయ పరిచారు. ఎమ్మెల్యే దేవ ముఖ్యంగా తాగునీరు, వ్యవసాయం, పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించి ఆయా శాఖలపై సమీక్షించి వాటి వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన తాగునీటి ప్రాజెక్టును మెగా ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ కంపెనీ ద్వారా ప్రాతిపదికన పనులు చేస్తున్నారని, రూ.1650 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో సుమారు 30 శాతం రాజోలు నియోజకవర్గం కేటాయిస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మండలంలో డంపింగ్ యార్డ్‌కు తక్షణమే స్థలం కేటాయించేలాగా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ వెంకటేశ్వరరావుకు సూచించారు. అలాగే రోడ్ల ప్రక్కన ఉన్నటువంటి చెత్తను వారం రోజుల్లో శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు హుకుం జారీ చేశారు. విద్యుత్తు, విద్య, వైద్య ఆరోగ్యశాఖల పనితీరిపై సమీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు నాని, అంజి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు , పలు శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమంలో కాంట్రాక్టర్లకు ప్రాముఖ్యత నిచ్చిన ఎంఎల్ఎ

మండల సర్వసభ్య సమావేశాల్లో సాధారణంగా ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు మండల స్థాయి అధికారులు వివరణ ఇవ్వడం ఆనవాయితీ. ప్రభుత్వ కార్యకలాపాలలో కాంట్రాక్టర్లకు అధికారికంగా పిలుపు ఉండదు. దీనికి భిన్నంగా ఎంఎల్ఎ దేవ మెగా ఇంజినీరింగ్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్యామ్ ను ప్రాజెక్టు సంబంధించినటువంటి వివరాలను తెలియజేయాల్సిందిగా కోరారు. దీంతో శ్యాం ఆ కంపెనీ చేపట్టిన ప్రాజెక్ట్ వివరాలను సమీక్ష సమావేశం తెలిపారు.

బాల బాలాజీ కళ్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

సహాయ కమిషనర్ ఎం. సత్యనారాయణ రాజు


సత్యనారాయణరాజు

ప్రజాశక్తి - మామిడికుదురు

ఉత్తర వాహినిగా ప్రవహించే వైనతేయ గోదావరి తీరాన అప్పనపల్లి లో వెలసిన శ్రీ బాల బాలాజీ స్వామి తిరు కళ్యాణ మహోత్సవాలకు సకల ఏర్పాట్లు చేశామని దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. కళ్యాణ మహోత్సవాల సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ కళ్యాణోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగులతో, విద్యుత్ అలంకారాలతో తీర్చిదిద్దామన్నారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతుల కల్పనకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ సిబ్బందిని సన్నద్ధం చేశామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి భక్తుల సౌకర్యార్థం శ్రీ బాలాజీ సదన్ నందు వసతి సదుపాయం అందుబాటులో ఉంచామన్నారు. ముఖ్య అతిథులు, ప్రజాప్రతినిధులు, జిల్లా మంత్రులు, శాసనసభ్యులు, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు, ఎంఎల్‌సి, నాయకులను, యావన్మంది యాత్రికులను ఆహ్వానించామన్నారు. అయిదు రోజులపాటు నిర్వహించే కళ్యాణ మహోత్సవాల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.


అప్పనపల్లి బాల బాలాజీ ఉత్సవ కమిటీ

17 మందితో బాల బాలాజీ ఉత్సవ కమిటీ

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి తిరుకల్యాణ మహోత్సవం సందర్భంగా ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ చైర్మన్‌గా 17 మంది సభ్యులతో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేశారు. సభ్యులుగా కొమ్ముల రామలక్ష్మి, అడబాల వెంకటేశ్వరరావు, ముత్యాల ప్రసాద్, గంటా అంజి, వడ్డీ దుర్గాదేవి, యనమదల తాతాజీ, గనిశెట్టి బాపన్న, కామిశెట్టి వీరన్న, దంగేటి నాగేశ్వరరావు,పెదసింగు లక్ష్మీనరసింహస్వామి, పాబోలు సామశేఖర్ రావు, కానేటి బాలయోగి, చిట్టూరి సత్యనారాయణ, నుదురుమాటి సత్యమాణిక్యం, గాడి సత్తిబాబు, వేగి వెంకటేశ్వరరావు సభ్యులుగా నియమితులయ్యారు. వీరికి ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు స్వామి వారి కండువాలు కప్పి అభినందనలు తెలిపారు. అర్చకులు వేద ఆశ్వీరాదం అందచేసే తీర్థప్రసాదాలు అందించారు.

అయినవిల్లిలో నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - అయినవిల్లి


దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అర్చకులు

మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని గురువారం మండల జడ్ పిటిసి మాజీ సభ్యురాలు గంగుమల్ల కాశి అన్నపూర్ణ, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాశి అన్నపూర్ణ, శ్రీనివాస్ మనవడు హను స్థితప్రజ్ఞ నామకరణం సందర్భంగా విఘ్నేశ్వర స్వామి నిత్యాన్నదాన నిధికి రూ.11,116 విరాళంగా ఇచ్చి నట్లు ఆలయ ఇఒ సత్యనారాయణ రాజు తెలిపారు. వీరికి అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటం బహూకరించారు.

వాడపల్లిలో అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి గురువారం విజయవాడ తాడిగడపకు చెందిన చంద్ర దిలీప్ కుమార్ జ్యోతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,00116 ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరరావుకు అందజేశారు.

కేశవ స్వామి ఆలయంలో అన్నదానానికి..

అలాగే ర్యాలి జగన్మోహిని కేశవ, గోపాల స్వామి వార్ల ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్నదానం నిర్వహించేందుకు మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన పేర్చెర్ల శాన్విత రాజు రూ.50,116 , పేర్చెర్ల నాగ వెంకట అనిందిత్ వర్మ రూ.10,116,, పేర్చెర్ల భాను రిధి రూ.5 వేల లయ కార్య నిర్వహణ అధికారి బివి.వెంకటరమణమూర్తికి అందజేశారు. వీరికి స్వామివారి దర్శనానంతరం స్వామివారి చిత్రపటాలతో పాటు శేష వస్త్రం అందజేశారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే వైసిపి విమర్శలు

ప్రజాశక్తి - కొత్తపేట

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి నాయకులు విమర్శలు చేస్తున్నారని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి అన్నారు. గురువారం వైసిపి నేతలు బారి నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని కోరుతూ వానపల్లి పళ్లాలమ్మ అమ్మ వారి ఆలయంలో టిడిపి నేతలు పూజలు నిర్వహించారు. కొత్తపేట మండల టిడిపి అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, గ్రామ సర్పంచ్ పల్లి భీమారావు, అవిడి డిస్ట్రిబ్యూటీ కమిటీ చైర్మన్ చవల జగన్నాథం, కొత్తపేట నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షులు పల్లి ఏసు, వానపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు నూకల వీరన్న, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి బూత్ కమిటీ జిల్లా అధ్యక్షులు కిషోర్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం


కిషోర్‌ను సత్కరిస్తున్న నాయకులు

. వైసిపి బూత్ కమిటీ జిల్లా అధ్యక్షునిగా ఉప్పలగుప్తంకు చెందిన రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చీకట్ల కిషోర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను గురువారం స్వగృహంలో వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, వైసిపి నాయకుడు గాడిలంక శ్రీను తదితరులు సత్కరించారు. కిషోర్ కు అభినందనలు తెలిపారు. పదవి ద్వారా వైసిపి పూర్వ వైభవానికి కృషి చేయాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

యోగా దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - రామచంద్రపురం

యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 9న నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను రామచంద్రపురం డిఎస్‌పి రఘువీర్ గురువారం పరిశీలించారు. ద్రాక్షారామ శ్రీ భీమశ్వర స్వామి ఆలయం ఆవరణలో యోగా దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. డిఎస్‌పి స్థానిక పోలీసులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. దీనిపై తీసుకోవలసిన జాగ్రత్తలను, వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం సిఐ వెంకట్ నారాయణ , ద్రాక్షారామ పోలీసులు పాల్గొన్నారు.



అమలాపురంలో మొక్కలు నాటుతున్న రమణారావు

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి - అమలాపురం

పర్యావరణ పరి రక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైసిపి నాయకుడు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా గురువారం అమలాపురంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రమణారావు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఒక మొక్కను నాటే అలవాటు చేసుకోవాలని రమణారావు సూచించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల జాన్సన్, పందిరి సుబ్బరాజు, గంటా లక్ష్మీప్రసాద్, నేరేడుమిల్లి శ్రీను, విప్పర్తి రమేష్, ముత్తాబత్తుల గణేష్,పరమట రాజేష్,కుంచే అర్జున్ తదితరులు పాల్గొన్నారు. **అయినవిల్లి:** కె.జగన్నాథపురం గ్రామంలో జడ్‌పిహెచ్ఎస్ స్కూల్లో ఆవరణలో హెచ్ఎం జి సూర్యకుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి శ్రీనివాం, గ్రామ సెక్రెటరీ కె.వెంకన్న మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు అలాగే విలస పంచాయతీ పరిధిలోని ఎస్ ఎం కాలనిలో స్థానిక సర్పంచ్ కుసుమ లిల్లీ మంగేష్కర్, సునీల్, సెక్రటరీ ధనలక్ష్మి మొక్కలు నాటారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తాతపూడి లో డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో గురువారం క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టిబి ఫ్రీ ఇండియా పై ప్రతిజ్ఞ చేయించి టీబి హారేగా దేశ్ జీతేగా నినాదాలు చేశారు. డాక్టర్ శిరీష మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 30వ తేదీ వరకు ప్రతి గ్రామంలో టీబి ముక్త భారత అభియాన్ పై అవగాహనా శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎస్‌టి ఎస్ బేగం, ఎంఎల్‌హెచ్‌పి దీప్తి, శ్రీ ఆరోగ్య కార్యకర్త దేవి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ఎంఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

తాము ఎన్నికైన నాటి నుండి ఇంతవరకు ప్రభుత్వం గౌరవ వేతనం చెల్లించలేదంటూ ఎంపిటిసి సభ్యులు ఆవేదన చెందారు. గురువారం సఖినేటిపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్‌ను సఖినేటిపల్లి ఎంపిటిసి సభ్యులు కలిసి మాట్లాడారు. తాము ఎన్నికై సుమారు రెండున్నర ఏళ్లు గడుస్తున్నార ఇంతవరకు ప్రభుత్వం ఎంపిటిసి సభ్యులు గౌరవ వేతనాన్ని చెల్లించలేదని ఎంఎల్ఎకు తెలియజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాల్సిందిగా ఎంపిటిసి సభ్యులు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్‌ను కోరారు. ఎంపిపి వీరమల్లిబాబు, వైస్ ఎంపిపిలు నాని, అంజి, పలు గ్రామాల ఎంపిటిసి సభ్యులు ఎంఎల్ఎను కలిసిన వారిలో ఉన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - మండపేట

మండపేట గవ్నమెంట్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికారి డి.హరిశేషు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా అధికారి మాట్లాడుతూ రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో నేడు ఉదయం 10 గంటలకు జరిగే జాబ్ మేళాను ఏర్పాటుచేశారన్నారు. ఈ మేళాలో 10 కంపెనీలకు సంబంధించిన సుమారు 380 ఖాళీలు భర్తీ చేయడానికి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్ఎస్‌సి, ఐటిఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పాలిటెక్నిక్, చదివిన యువతి యువకులు ఈ జాబ్ మేళాను వినియోగించుకోవాలని అన్నారు. నిరుద్యోగ యువతి, యువకులకు మెగా జాబ్ మేళాకు సంబంధించిన తమ యొక్క సందేహాలను నివృత్తి చేసుకునేందుకు సెల్ నెంబర్లు వినోద్ స్కిల్ హబ్ కోఆర్డినేటర్ 8099183854, రాజేంద్ర ప్రసాద్ ప్లేస్మెంట్ ఆఫీసర్ 9704414258లో సంప్రదించవచ్చున్నారు.

మృతుని సోదరికి చెక్కు అందజేత

ప్రజాశక్తి - మండపేట

మండపేట కు చెందిన కులపాక మల్లేశ్వర వీర వెంకట రోహిత్ ముమ్మిడివరం వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగి కొట్టుకుని పోయి మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన రూ 2 లక్షలు ఆర్థిక సహాయం చెక్కును ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు గురువారం అనాథగా మిగిలిన రోహిత్ సోదరి బిందు మాధవికి అందజేశారు. రోహిత్ తండ్రి రవీంద్రనాథ్ ప్రసాద్, ఎంఎల్ఎ వేగుళ్ళ ఆమె నివాసం ఉంటున్న గొల్లపుంత లో టిడ్కో అపార్ట్మెంట్ లో ఫ్లాటుకు స్వయంగా వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన తక్షణ భృతి రూ.2 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మండపేట మాజీ మునిసిపల్ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, తహశీల్దార్ పి.తేజేశ్వరరావు, ఎఎంసి డైరెక్టర్ మేడింటి సూర్య ప్రకాశ రావు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - మండపేట

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట టిడ్కో అపార్ట్ మెంట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ళ మాట్లాడుతూ అవసరమైన సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కమిషనర్ టివి. రంగారావు కు సూచించారు. ఈ కార్యక్రమంలో మండపేట మున్సిపల్ చైర్మన్ పతివాడ రాణి, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, మున్సిపల్ డిఇ శ్రీనివాస్, ఎఇలు ఆంజనేయులు, పవన్ కుమార్, 6వ వార్డు కౌన్సిలర్ కాశిన కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

శేషారావుకు ఎంఎల్ఎ బండారు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కొత్తపేట

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎపి ఎస్ఎస్‌డిసి చైర్మన్‌గా విజయవాడలోని బూరుగుపల్లి శేషారావు ఆయన కార్యాలయంలో గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు శుభాకాంక్షలు తెలియజేశారు.

కుప్పం రాజశేఖర్‌కు..

ఎపి విద్య సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ ఎపిఇడబ్ల్యూ ఐడిసి చైర్మన్‌గా గురువారం విజయవాడ కార్యాలయంలో పదవి బాధ్యతలు కుప్పం రాజశేఖర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు రాజశేఖర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.



చెయ్యేరు పాఠశాల్లో మిడ్ డే మీల్స్ నిర్వాహకులకు జాగ్రత్తలు నేర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మిడ్డే మీల్ నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి -కాట్రేనికోన

.ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ రుచికరమైన భోజనం అందించాలని చెయ్యరు సర్పంచ్ చెల్లి సురేష్ పేర్కొన్నారు. మండలంలోని 75 పాఠశాలల మధ్యాహ్నం భోజన పథక నిర్వాహకులకు, సహాయకులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం గురువారం చెయ్యేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. అగ్నిమాపక అధికారి మాట్లాడుతూ వంట చేసే సమయంలో జరిగే అగ్ని ప్రమాదాలు, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర వాటిపై ఈ పథక నిర్వాహకులకు వివరించారు. మండల విద్యాశాఖ అధికారులు మధ్యాహ్న భోజన పథక నిర్వహణ గురించి పలు సూచనలు చేశారు. అనంతరం పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైస్కూల్లో మొక్కలను నాటారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నడింపల్లి సుబ్బరాజు, తహశీల్దార్ సునీల్ కుమార్, ఎంఇఒ వెంకటరమణ, హెచ్ఎం. వెంకటేశ్వరరావు, అగ్నిమాపకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అందించాలి

ఆత్రేయపురం: ప్రభుత్వ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా అందిస్తున్న ఆహారంలో మెనూ సక్రమంగా అందించాలని ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట్ రామన్ అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్న భోజన నిర్వహికులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు . ఆయన మాట్లాడుతూ పాఠశాలల పరిసరాలు, వంట పాత్రలు, వంటశాల, పరిశుభ్రంగా ఉండాలన్నారు. ప్రభుత్వ జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి రోజువారీ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారుచేయాలన్నారు. ఎంఇఒ పి.వరప్రసాదరావు మాట్లాడుతూ వంట నిర్వహకులు వంట ప్రాంత పరిసరాలతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ మూర్తి, ఎఎన్.ఎమ్లు, ఉపాధ్యాయుడు ఎస్‌వివిఎన్ఎస్.ప్రసాద్, ఆఫీస్ కంప్యూటర్ ఆపరేటర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.